క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో తేనె విక్రయ దుకాణం



తెనాలిరూరల్: స్వయం ఉపాధి పథకం కింద మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన నీలాంబరి డ్వాక్రా సంఘం సభ్యురాలు కడియాల లక్ష్మి తెనాలి రైల్వేస్టేషన్‌లో తేనె విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ సహకారంతో పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకురాలు లక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్టాల్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, జగన్, ప్రసాద్, గోగినేని లోకేశ్వరి, గద్దెల శైలజ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి గౌరవాధ్యక్షుడు కాసా రామశ్రీను జన్మదినాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో సోమవారం గోవులకు దాణా పంపిణీ చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడుతూ రామశ్రీను ఇప్పటి వరకు 59 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ మీరావలి, షేక్ అబ్దుల్ మతీన్, మునిపల్లి వంశీ, పోతురాజు, ఆషా, శివ, అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంల్లో నిలిచిన నగదు లావాదేవీలు



తెనాలిటౌన్: 2025 మార్చి 31 నెలాఖరు కావడం వలన ఏటీఎంల్లో నగదు లావాదేవీలు దాదాపుగా నిలిచిపోయాయి. దీని వల్ల ఖాతాదారులు నగదు విత్ డ్రా చేసుకునేందుకు వచ్చి తీవ్ర నిరాశకు గురయ్యారు. గత రెండు రోజులుగా దాదాపుగా అన్ని బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలలో నగదు రావడం లేదని, ఎస్‌బీఐ మినహా మరికొన్ని బ్యాంకులు ఏటీఎంల షట్టర్లు క్లోజ్ చేసి ఉంచారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో అక్కడక్కడ ఎస్‌బీఐ ఏటీఎంలలో నగదు విత్ డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. మార్చి 1వ తేదీ కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారుల విశ్వసనీయ సమాచారం. కావున ఖాతాదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగ ముస్లిం మైనార్టీలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొలకలూరులోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, పలువురు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

బాలుడిపై పెంపుడు కుక్కల దాడి



దుగ్గిరాల: నాలుగు సంవత్సరాల బాలుడిపై పెంపుడు కుక్కల దాడి చేసిన ఘటన పేరుకలపూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి కల్యాణ్‌కుమార్ కొడుకు సర్దార్ ఆరుబయట ఆడుకుంటూ ఉండగా కుక్కలు ఒక్కసారి దాడి చేశాయి. బాలుడి కాలు, వీపుపై గాట్లు పడ్డాయి. బాలుడిని స్థానిక ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఒకే ఇంటిలో సుమారు ఎనిమిది కుక్కలు ఉన్నాయని, గతంలో కూడా చాలా మందిని గాయపరిచాయని బాలుడి తల్లి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

‘గడప గడపకు మన ప్రభుత్వం’ రద్దు

- ఆదేశాల జారీ చేసిన కూటమి ప్రభుత్వం
- ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన సాగిన పనులు
- అసహనం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు
- తెనాలిలో 55 పనులు రద్దు
- పథకం రద్దుతో కుంటుపడిన అభివృద్ధి



పాండురంగపేటలో ప్రారంభంకానీ రోడ్డు పనులు

తెనాలిఅర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. సకాలంలో పనులు చేయించకపోవటం... వాటి బిల్లులను వెంటనే ఆన్‌లైన్ చేయకపోవటంతో తెనాలి పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. ఇంతలో కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిగా రద్దు చేయటంతో తెనాలి పట్టణంలో వివిధ దశలలో ఉన్న 55 పనులు రద్దయ్యాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించింది. తెనాలి పట్టణంలోని మొత్తం 40 వార్డులలో 37 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. గత ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు వారు తెలియజేసిన సమస్యలను అధికారులతో నమోదు చేయించారు. వార్డులో కార్యక్రమం పూర్తి కాగానే సచివాలయంకు ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయించి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

తెనాలిలో 128 పనులకు ప్రతిపాదనలు

పట్టణంలో 37 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసి 128 పనులకు స్థానిక అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపారు. దీనికోసం ప్రభుత్వం రూ.8.40 కోట్ల నిధులు వెచ్చించింది. దీంతో పట్టణంలోని వివిధ మురుగు కాల్వలు, కల్వర్టులు, సీసీ రోడ్లు వంటి 73 పనులు పూర్తి చేసి వాటికి సంబంధించిన బిల్లుల కింద రూ.4.74 కోట్ల నిధులు చెల్లించారు.

నిలువెల్లా.. ‘ఇంజనీరింగ్’ నిర్లక్ష్యం!

తెనాలి పట్టణంలోని 128 పనుల్లో 2023 డిసెంబర్ నాటికి కేవలం 73 పనులు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో ఒక పనిని ప్రారంభించి 25 శాతంలోపు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో ఆరు టెండర్ల దశలోనే నిలచిపోగా, 48 పనులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావటంతో ఆ పనుల్లో అధికారులు నిమగ్నం కావడంతో వీటి పర్యవేక్షణను నిలిపివేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జిల్లాలోనే తెనాలి ముందు వరుసలో ఉంది. వార్డులో కార్యక్రమం పూర్తి అయిన వెంటనే అధికారులు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపి అనుమతులు తెచ్చుకున్నారు.

టెండర్లు పిలచి పనులు కాంట్రాక్టర్‌లకు అప్పగించారు. అక్కడి నుంచి ఆ సమయంలో పనిచేసిన ఏఈ, డీఈలు కాంట్రాక్టర్‌లతో పనులు చేయించలేకపోయారు. దీనికి కారణం పనిచేసిన వాటిని ఆన్‌లైన్‌లో వెంటనే అప్‌లోడ్ చేయకపోవటం.. బిల్లుల చెల్లింపులలో జాప్యం చేయటంగా పలువురు కౌన్సిలర్‌లు ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆరోపించారు. ఇంజినీరింగ్ అధికారులు తమ విధులు సకాలంలో నిర్వహిస్తే తమ వార్డులలో అభివృద్ధి పనులు జరిగి ఉండేవని వారు తెలిపారు.

గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం 2022 మొదట్లోనే పూర్తి అయిన సాధారణ ఎన్నికల కోడ్ వచ్చే వరకు తన వార్డులో పనులు ప్రారంభించ లేకపోయారని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. ఈవిషయాన్ని ఆ సమయంలో కౌన్సిల్‌లో అనేక సార్లు ప్రశ్నించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని బట్టి చూస్తే ఇంజినీరింగ్ అధికారులు ఆనాడు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో మనకు అర్థమౌతుంది.

రద్దు చేస్తూ ఉత్తర్వులు!

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేస్తు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో తెనాలి పట్టణంలో వివిధ దశలలో ఉన్న 55 అభివృద్ధి పనులు రద్దు అయ్యాయి. దీనివల్ల గత ప్రభుత్వం ఈ పథకం కోసం తెనాలి పట్టణానికి కేటాయించిన రూ.3.66 కోట్ల నిధులు వెనక్కి మళ్లినట్లు అయ్యింది.



26వ వార్డులో ప్రారంభానికి నోచుకుని మురుగు కాల్వ పనులు



5వ వార్డులో ప్రారంభంకాని సీసీ రోడ్డు పనులు



ప్రారంభంకాని మురుగు కాల్వ పనులు

ఇతర నిధులతో పనులు చేస్తాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. తెనాలి పట్టణంలో ఈ పథకం ద్వారా వివిధ దశలలో నిలచిన 55 పనులు రద్దయ్యాయి. వాటిని ప్రాధాన్యతా క్రమంలో వివిధ నిధులతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–బండి శేషన్న,
కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

జగనన్న హయాంలోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం

రంజాన్ పర్వదినాన తనను కలిసి ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎంతో తోడ్పడిందని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం రోజున పలువురు ముస్లిం సోదరులు స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శివకుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. స్వీటు తినిపించారు. పట్టణం, రూరల్ మండల గ్రామాల్నుంచి వేర్వేరుగా వచ్చిన ముస్లిం సోదరులకు శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పర్వదినం ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపాలని, అల్లా ఆశీర్వాదం నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. దేశంలో ముస్లిం వర్గీయుల్లోనే పేదరికం ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. అందుచేతనే వీరిని సామాజికరంగా, రాజకీయంగా పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, తర్వాత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేసినట్టు చెప్పారు. రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో ఎందరో ముస్లిం మైనార్టీల పిల్లలు ఉన్నత చదువులు చదవగలిగినట్టు చెప్పారు. అదేవిధంగా వివిధ సంక్షేమ పథకాలను ముస్లింలకు ఆయా డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వాలు గరిష్ఠంగా అందజేశాయని చెప్పారు. ఆ కృషిలో గత అయిదేళ్లలో తానూ భాగస్వామిని కావటం గర్వపడుతున్నానని, నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు గత అయిదేళ్లు అండగా ఉంటూ, సంక్షేమాన్ని అందజేసినట్టు గుర్తుచేశారు. శివకుమార్‌ను కలిసినవారిలో గోల్డ్ రహిమా, షేక్ దుబాయ్‌బాబు, షేక్ బాష, సయ్యద్ గౌస్, జిలానీ బాషా, సయ్యద్ జానీ బాషా, టెక్స్ బాల, షేక్ అన్సారీ, పఠాన్ సుభాని, పెచ్చింగ్ సుభాని, సిలార్ జానీ తదితరులున్నారు.

తూములూరులో జెండా ఊరేగింపు



ఊరేగింపును ప్రారంభించిన అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: కొల్లిపర మండల గ్రామమైన తూములూరులో ఈదా హర్షవర్ధన్ రెడ్డి కుటుంబీకులకు వంశపారంపర్యంగా వస్తున్న జండా మొక్కుబడుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ఈద హర్షవర్ధన్ రెడ్డి ఇంటి నుంచి సాగిన జండా ఊరేగింపును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కనక తప్పెట్ల మధ్య సాగిన ఊరేగింపులో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలోని నాగదాసుతాత మఠం వరకు ఊరేగింపు చేరుకుంది. అక్కడ మొక్కుబడులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈదా హర్షవర్ధన్ రెడ్డి యూత్, ఈమని హరి కోటి రెడ్డి, చంచల రామిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, వీరారెడ్డి, భద్రం బసవపున్నారెడ్డి గ్రామానికి చెందిన పలువురు నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల నాయకులు

తెనాలిటౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మృతికి చింతిస్తూ ఆయన మృతికి కారకులైన దోషిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏప్రిల్ 2వ తేదీ బుధవారం నిర్వహించే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఐతానగర్‌లో సోమవారం ఈరే న్యూ లైఫ్ ఫ్యామిలీ వర్షిప్ చర్చి నందు క్రైస్తవ సంఘ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ కూచిపూడి అబ్రహాం మాట్లాడుతూ స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని క్రైస్తవ సమాజానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవరెండ్ ఎ.భానుప్రసాద్, బిషప్ కె.సుధీర్ కుమార్, బ్రదర్ పి.ఐజక్, బిషప్ జె.ప్రభుదాసు, బ్రదర్ సల్మాన్, రావూరి విక్టర్ పాల్, మార్టిన్ లూథర్‌బాబు, టి.శ్యామూల్, బ్రదర్ ఆనందన్న, ఎన్.చిట్టిబాబు, అబ్రహాం, స్టీఫెన్ పాల్గొన్నారు.

తెనాలిలో 86 శాతం పన్ను వసూలు



పన్నుల చెల్లింపులను పరిశీలిస్తున్న ఆర్‌వో రాంప్రసాద్

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంటి, నీటి, ఖాళీ స్థల పన్నుల వసూలు సోమవారంతో ముగిసింది. తెనాలి పట్టణంలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.21 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా సాయంత్రం 6గంటల సమయానికి రూ.18కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ తెలిపారు. రంజాన్ పండుగ రోజు కూడా పన్నుల వసూలు కొనసాగించామని, ఒక రోజే రూ.50 లక్షలు వసూలు చేయగలిగమని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రంతో పాటు పట్టణంలోని ఐదు తాత్కాలిక పన్నుల చెల్లింపు కేంద్రాల్లో పనిచేశాయి. రాత్రి 11 గంటల సమయంలోపు ఇంకొక రూ.30లక్షలు వసూలు కావచ్చు అనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గతంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం పన్నులు వసూలు పెరిగిందని చెప్పవచ్చు.

మూడో రోజుకు చేరిన ఎడ్ల పందేలు



నాలుగు పళ్ల విభాగంలో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తెనాలిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన మూడో రోజుకు చేరుకుంది. సోమవారం సాయంత్రం ఆరుపళ్ల విభాగం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 14 జతల ఎడ్లు పాల్గొనగా రాత్రి 10.15 వరకు పోటీలు కొనసాగాయి. అలాగే గురువారం రాత్రి నాలుగు పళ్ల విభాగం పోటీలు ముగిశాయి. మూడో రోజు ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఎడ్ల బలప్రదర్శనలు రైతాంగానికి ప్రోత్సాహాన్నివ్వడంతో పాటు పశు పోషకులను ప్రోత్సహిస్తాయని మంత్రి వివరించారు. ఇంత వరకు ఇంత భారీ ఎడ్లబల ప్రదర్శనను తాను చూడలేదని చెప్పారు. నాలుగు పళ్ల విభాగం విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జె.పంగలూరుకు చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4260.03 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ జత ప్రతినిధులకు మంత్రి బహుమతులను అందజేశారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, ఎన్. అబద్దయ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

పాల పోటీలు ప్రారంభం..

ఆవు పాల పోటీలను ప్రారంభమయ్యాయి. పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌నందం అబద్దయ్య పోటీలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం పాలు పితికి విజేతలను ప్రకటిస్తారు. పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఆలపాటి వెంకట్రామయ్య పర్యవేక్షిస్తున్నారు.

మానవ జీవితానికి దారి దీపాలు గ్రంథాలయాలు

నగరంపాలెం: గ్రంథాలయాలు మానవ జీవితానికి దారి దీపాలు అని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పునర్వికాస ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయాలు పునర్వికాసం పొందాలని అన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను కొంతమేర గ్రంథాలయాలకు కేటాయించాలని చెప్పారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



మురుగు నిల్వ ప్రాంతాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ ప్రాంతంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గ్రామ కార్యదర్శి నాగపోగు విజయరాజుతో కలసి దళితవాడలోని మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లెకృష్ణ మాట్లాడుతూ గుండిమెడ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతోందని, పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తామని అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో, పరిసరాలలో వాడిన వ్యర్థపు మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మురుగునీరు భూగర్భ జలాలలో ఇంకిపోవడం వలన తాగునీరు కూడా కలుషితమవుతుందని చెప్పారు. ప్రజలు జబ్బులబారిన పడక ముందే విలీన గ్రామమైన గుండిమెడలో మురుగు సమస్యను నివారించేందుకు డ్రైనేజీలను నిర్మించి, మురుగునీరు పారుదలయ్యే విధంగా ఎంటీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మాలకొండారెడ్డి వర్ధంతి



మాలకొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: మాలకొండారెడ్డి వర్ధంతిని ఎంటీఎంసీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మాలకొండారెడ్డి స్తూపం వద్ద సోమవారం సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాలకొండారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ సుందరయ్యనగర్ ప్రాంతంలో పేదల ఇళ్ల నివాసం ఏర్పాటులో కీలక భూమిక పోషించిన ధన్యజీవి మాలకొండారెడ్డి అని అన్నారు. సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు నిలబడిన పనిచేసిన వ్యక్తి మాలకొండారెడ్డి అన్నారు. నాయకులు ఎ. జగన్, ఎస్. వెంకటరావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, కొట్టే కరుణాకర్‌రావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, నాగేశ్వరరావు, కె. మేరి, గిరిజ, దర్శనపు విజయ్‌బాబు, వెంకన్న, సామేలు పాల్గొన్నారు.

ఈద్గా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. చెంచుపేటలోని ఈద్గాను సోమవారం ఉదయం ఆయన పరిశీలించారు. రంజాన్ ప్రార్థనల అనంతరం కూడా ఆవరణను శుభ్రం చేయాలని సూచించారు. ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈద్గా రోడ్డు మొత్తాన్ని శుభ్రం చేయించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత రాణారాయల్



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బేతపూడి ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెటు పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 8 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో యాంగ్రీ టైగర్స్ టీం పది ఓవర్లలో 63 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. రాణా రాయల్ ఫైటర్స్ టీం ఏడు ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఖాజబంద, బెస్ట్ బౌలర్‌గా మదార్ వలి నిలిచారు. విజేతకు రూ.10 వేల నగదు, షీల్డ్‌ను లైఫ్‌కేర్ డయాగ్నస్టిక్ అధినేత షేక్ వలే, ఖాజా మొహిద్దీన్ అందజేశారు.

శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కోటేశ్వరరావు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు ఎనిమిది మందిని ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. తమకు అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్‌కు, సహకరించిన నాయకులకు బోగి కోటేశ్వరరావు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

మంగళగిరి టౌన్ : గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ మంత్లీ మ్యాగజైన్ ఉగాదిని పురస్కరించుకుని జిల్లాకు చెందిన శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా ప్రోత్సాహకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కోచ్ పీవీఎస్ సత్యనారాయణ, సభ్యులు శంకర్ రెడ్డి, రమేష్‌కు ఉగాది క్రీడా పురస్కారాలు దక్కాయి. క్రీడాపురస్కారాలు దక్కడంతో మంగళగిరికి చెందిన పలువురు సోమవారం వారికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల క్రితం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేసి కార్మికులను నడివీధిలో నిలబెట్టారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గురవయ్య, వై. రమాదేవి, టి. దుర్గాభవాని, ఇమాంబి, సారమ్మ, సుబ్బారావు, హగ్గయ్య, బి. నవనీతం పాల్గొన్నారు.